


పాత రోడ్లకే సీసీ.. కొత్త వీధులకు నిరీక్షణ..!

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -61 మంగళవారం 4 ఆగస్టు 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు 5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Disitrcts

## నిర్దోషిగా బ్రిజ్ భూషణ్

**మహిళా రెజ్లర్ల లైంగిక వేధింపుల కేసులో బ్రిజ్ భూషణ్‌కు ఊరట**

- ఆయన్ను నిర్దోషిగా ప్రకటించిన ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు
- సహ నిందితుడు వినోద్ తోమర్‌కు కూడా క్లీన్ చిట్
- గౌరవప్రదంగా నిర్దోషిగా తేల్చిందన్న బ్రిజ్ భూషణ్



**న్యూఢిల్లీ ఆగస్ట్ 03(జర్నలిస్ట్ వార్త);**
మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ నేత బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్‌కు భారీ ఊరట లభించింది. ఈ కేసులో ఆయనను, మరో నిందితుడు వినోద్ తోమర్‌ను నిర్దోషులుగా తేలుస్తూ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు నేడు తీర్పు వెలువరించింది. దీంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసుకు తెరపడినట్లయింది.
తీర్పు వెలువడిన వెంటనే బ్రిజ్ భూషణ్ 'ఎన్డీటీవీ'తో మాట్లాడుతూ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. "నాపై ఆరోపణలు వచ్చిన రోజే చెప్పాను..

మిగతా 2లో.

# ప్రాజెక్టుల జలకళ






- లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- గోదావరిలో తగ్గిన వరద ప్రవాహం
- రాష్ట్రంలో విచిత్ర వాతావరణం
- మధ్యాహ్నం ఎండ, సాయంత్రం వాన
- హైదరాబాద్‌లో భారీ వర్షం
- రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నేడు, రేపు మోస్తరు వర్షాలు

హైదరాబాద్, **ఆగస్ట్ 03(జర్నలిస్ట్ వార్త);**
ఎగువ పరీవాహక ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గోదారమ్మ శాంతించినా.. కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. సోమవారం ఆల్మట్టి ప్రాజెక్టుకు 1.36 లక్షల క్యూసెక్కుల వరద రాగా... 1.50 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలిపెట్టారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 1.28 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా... 1.29 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టుకు 1.92 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా... దాదాపు అంతే మొత్తాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇది మరింత

మిగతా 2లో.

## స్తంభించిన పార్లమెంట్

- నీట్ పేపర్ లీక్, అయోధ్య రామాలయ విరాళాల
- చోరీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఆందోళన
- నిరసనల మధ్యే ఉభయ సభల్లో రెండు బిల్లులు
- ఎలాంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో ఆమోదం



**న్యూఢిల్లీ ఆగస్ట్ 03(జర్నలిస్ట్ వార్త);**
నీట్ పేపర్ లీకేజీ, అయోధ్య రామాలయ విరాళాల చోరీ ఘటనలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఆందోళనతో పార్లమెంట్ స్తంభించింది. జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన అణచివేతకు హోం మంత్రి సరైన వివరణ ఇచ్చే వరకు పార్లమెంటులో తమ ఆందోళనను కొనసాగి స్తామని ప్రతిపక్షం పేర్కొంది. ఈ డిమాండ్ తో లోక్‌సభ, రాజ్యసభలలో ప్రతిపక్షాలు

మిగతా 2లో.



## బీజేపీకి ఎదురుగాలి

- మధ్యప్రదేశ్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు
- గుజరాత్‌లో కమలంకు తగ్గిన మెజార్టీ
- కాషాయ కంచుకోటలో ప్రశాంత్ కిషోర్ ఘన విజయం

**బంకిపూర్ ఆగస్ట్ 03(జర్నలిస్ట్ వార్త);**
జెన్ జీ ఉద్యమంతో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించిన ఉప ఎన్నికల ఫలితాల్లో బీజేపీ జాతీయ అధ్యక్షుడి స్థానాన్ని ఆ పార్టీ కోల్పోయింది.

మిగతా 2లో.

## చక్రవర్తి తన డిగ్రీ చూపిస్తారా?

- ప్రశ్నించిన అభిజిత్ దీప్కే -స్కాలర్‌షిప్‌తో, రుణంతో చదువుకున్నానని వెల్లడి
- సీజేపీ సామాజిక ఉద్యమంగానే కొనసాగుతుందని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ ఆగస్ట్ 03(జర్నలిస్ట్ వార్త);**
నీట్ పేపర్ లీక్ వ్యవహారం లో దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే లక్ష్యం గా బీజేపీ సర్కార్ పావులు కదుపుతుంది. దీప్కే అమెరికా చదువుకునేందుకు డబ్బులు ఎలా వచ్చాయంటూ బీజేపీ నాయకులు ఆర్‌టీఐ దరఖాస్తును దాఖలు చేశారు. దీనిపై అభిజిత్ స్పందిస్తూ తన డిగ్రీని, విద్యా రుణాలకు సంబంధించి



మిగతా 2లో.

## రాయలసీమ వనరులు తీవ్రంగా దోపిడీకి గురయ్యాయి

- రైజింగ్ రాయలసీమ కార్యక్రమంలో పాల్గొన్న మాధవ్
- ఈ ప్రాంతం నుంచి ఎంతో మంది సీఎంలు వచ్చారని వ్యాఖ్య
- రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచించాలి

**కర్నూలు ఆగస్ట్ 03(జర్నలిస్ట్ వార్త);**
రాయలసీమ విశ్వవిద్యాలయంలో సమర్థ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైజింగ్ రాయలసీమ' కార్యక్రమంలో బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సీమ ప్రాంత

మిగతా 2లో.



## "మిస్టర్ డ్రామారావు"

### కేటీఆర్ పై మంత్రి పొంగులేటి ఫైర్

- సుదర్శన్ రెడ్డి మరణంతో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని ఆరోపణ
- పదేళ్లలో మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించారని విమర్శ
- అధికార లాంఛనాలతో గౌరవించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని వెల్లడి
- వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని వ్యాఖ్య



తెలంగాణ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దివంగత ఉద్యమ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మరణాన్ని కేటీఆర్ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపిస్తూ సోమవారం 'ఎక్స్' వేదికగా ఘాటు విమర్శలు చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఆయన్ని విస్మరించి, ఇప్పుడు ఆయన మరణంపై రాజకీయం చేస్తున్న 'మిస్టర్ డ్రామారావు' కేటీఆర్ అంటూ పొంగులేటి మండిపడ్డారు.

మిగతా 2లో.

## 2 లక్షల ఉద్యోగాలు ఎప్పుడిస్తారో చెప్పాలి

**అది సూసైడ్ నోట్ కాదు కాంగ్రెస్ ప్రభుత్వంపై చార్జీషీట్**

**భవనాలే కాదు రాజకీయంగా సమాధి కట్టడమూ తెలుసు**

- 89 కేసులున్న సీఎం రేవంత్‌రెడ్డి క్రిమినల్ వేస్ట్
- నిరుద్యోగులు బలవన్మరణాలకు పాల్పడొద్దు
- ప్రభుత్వ ఒత్తిడి వల్లే పెద్ది సుదర్శన్‌రెడ్డి మరణం
- అసెంబ్లీ సమావేశాలు 15 రోజులు జరపాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్

**హైదరాబాద్‌ఆగస్ట్ 03(జర్నలిస్ట్ వార్త);**
ఉద్యోగాలకు నోటిఫికేషన్లు రాక ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురానికి చెందిన గడ్డం వేణు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడం బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అన్నారు. ఆయన విడుదల చేసింది సూసైడ్ నోట్ కాదనీ, రాష్ట్ర ప్రభుత్వంపై చార్జీషీట్ వంటిదని విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 89 కేసులున్న రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిగా

మిగతా 2లో.



### కర్ణాటక కేబినెట్ విస్తరణతో

## కాంగ్రెస్‌లో తీవ్ర అసమ్మతి

- చివరి నిమిషంలో మంకాల్ వైద్య పేరు తొలగింపు
- సీనియర్ లింగాయత్ నేత ఎస్.ఎస్. మల్లికార్జున్‌కు చోటు
- పదవులు దక్కని ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తామని హెచ్చరిక
- ఎమ్మెల్యే తన్వీర్ సేఠ్ మద్దతుదారుడి ఆత్మహత్యాయత్నం

కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మంత్రివర్గ విస్తరణ ఆ పార్టీలో తీవ్ర అసంతృప్తిని, అంతర్గత విభేదాలను రాజేసింది.

మిగతా 2లో.




## జోగినులకు అండగా ప్రభుత్వం

- లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల వేడుకల్లో పాల్గొన్న పొన్నం ప్రభాకర్
- అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించిన మంత్రి
- జోగినులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇస్తామని వెల్లడి

**హైదరాబాద్‌ఆగస్ట్ 03(జర్నలిస్ట్ వార్త);**
లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల సందర్భంగా బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జోగినుల కోసం కీలక ప్రకటనలు చేశారు. జోగినులకు ప్రత్యేక గుర్తింపునిస్తూ ఐడెంటిటీ కార్డులు (గుర్తింపు కార్డులు) జారీ చేయడంతో పాటు భవిష్యత్తులో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

మిగతా 2లో.



# స్తంభించిన పార్లమెంట్

ఏకతాటిపైకి వచ్చి ఆందోళన చేయడంతో సభా కార్యకలాపాలకు పలుమార్లు అంతరా యం ఏర్పడింది. జంతర్ మంతర్ వద్ద పోలీసుల అరాచకాలకు, అయోధ్యలోని రామ మందిర దోపిడీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు పార్లమెంటు వెలుపలా నిరసన తెలిపాయి. 'అమిత్ షా పార్లమెంటుకు ఎందుకు రావడం లేదు?' అంటూ రాసి ఉన్న పెద్ద బ్యానర్‌ను ప్రదర్శించడంతో పాటు ప్లకార్డులతో ఆందోళన చేపట్టాయి. వర్షాకాల సమావేశాలు మూడో వారంలోకి ప్రవేశించినప్పటికీ ఉభయ సభలలో ప్రతిపక్షాలు కొనసాగిస్తున్న ఆందోళన కేంద్ర ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బగా పరిణమించాయి. ఈ భారీ నిరసనల మధ్యే ప్రధాన న్యాయమూర్తితో సహా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 34 నుంచి 38కి పెంచే చట్ట సవరణ లోక్‌సభలో ఎలాంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. అదే విధంగా ప్రతిపక్షాల నిరసనల మధ్యే రాజ్యసభలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి (సవరణ) బిల్లు మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. సంయుక్త పార్లమెంటరీ కమిటీ సహకార (సవరణ) చట్టానికి మద్దతుగా తన నివేదికను సమర్పించింది. స్వల్ప మార్పులతో ఈ బిల్లును చట్టంగా మార్చాలని జేపీసీ సిఫారసు చేసింది. లోక్‌సభలో, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 'బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ యాక్ట్ స్తంభించిన పార్లమెంట్ సవరణ బిల్లు, కేంద్ర సహాయ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్.. ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ బిల్లును ప్రవేశపెట్టారు. ఇది బ్యాంకు రికార్డులను కోర్టులో విశ్వసనీయ సాక్ష్యంగా స్వీకరించడానికి అనుమతిస్తుంది. 1891 నాటి చట్టం స్థానంలో వచ్చిన ఈ కొత్త చట్టంలో, డిజిటల్, ఎలక్ట్రానిక్, వర్చువల్ రికార్డులను బ్యాంకు రికార్డులుగా చేర్చడానికి నిబంధనలు ఉన్నాయి.ఇదిలా ఉండగా లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మెన్ ఉభయ సభలలో ప్రతిపక్షాల నిరసనలను అణచివేసేందుకు పలుమార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. జంతర్ మంతర్ వద్ద పోలీసుల చర్య, అయోధ్యలో దారుణాలపై వివరంగా చర్చించకుండా నిరసనల నుంచి వెనక్కి తగ్గబోమని ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. నిరసనలు తీవ్రతరం కావడంతో ఉభయ సభలను నేటికి వాయిదా వేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా భవిష్యత్ నిరసనల కోసం ప్రణాళికలు రూపొందించడానికి ఇండియా బ్లాక్ ఎంపీలు సమావేశమయ్యారు.

# బీజేపీకి ఎదురుగాలి

**మొదటిపేజీ తరువాయి**

మధ్యప్రదేశ్‌లోని దాతియా నియోజకవర్గం లో కాంగ్రెస్ గెలుపొందగా, గుజరాత్‌లోని మంజల్‌పూర్ నియోజకవర్గాన్ని బీజేపీ నిలబెట్టుకుంది. ఇక బీజేపీకి కంచుకోట అయిన బంకిపూర్ నియోజకవర్గంలో ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ (జేఎస్పీ) వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ ఘన విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాపై ప్రశాంత్ కిషోర్ 18,953 ఓట్ల తేడాతో గెలుపొందారు. తొలి రౌండ్ నుంచే బీజేపీపై ఆధిక్యత కనబరుస్తూ వచ్చిన కిషోర్‌కు మొత్తంగా 63,203 ఓట్లు రాగా, సిన్హాకు 44,250 ఓట్లు లభించాయి. ఆర్జేడీ అభ్యర్థి రేఖా కుమారి 14,085 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఈ వార్త తెలియగానే జన్ సురాజ్ పార్టీ ప్రధాన కార్యాలయంలో, ఓట్ల లెక్కింపు కేంద్రం వెలుపల సంబురాలు మిన్నంటాయి. పార్టీ అభిమానులు, మద్దతుదారులు డ్యాన్స్‌లు చేస్తూ, మిఠాయిలు పంచుతూ కనిపించారు. మాజీ ఎన్నికల వ్యూహకర్త అయిన కిషోర్ కొన్నేండ్ల క్రితమే పార్టీని స్థాపించారు. మొదటిసారిగా ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. 1995 నుంచి ఈ సీటులో బీజేపీ ఎన్నడూ ఓడిపోలేదు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో రాజ్యసభకు ఎన్నిక కావడంతో బంకిపూర్ సీటుకు ఉప ఎన్నికలు జరిగాయి. జులై 30న ఉప ఎన్నికల్లో 34.30శాతం ఓట్లు పోలయ్యాయి. మొత్తంగా 26 మంది అభ్యర్థులు బరిలోకి దిగారు. ఈ అసెంబ్లీ సీటు నుంచి నబిన్ వరుసగా ఐదు సార్లు విజయం సాధించారు. అంతకుముందు ఆయన తండ్రి ప్రాతినిధ్యం వహించారు.

**బీజేపీ నాయకత్వాన్ని బీహార్ ప్రజలు తిరస్కరించారు : ప్రశాంత్ కిషోర్**

బీహార్ ప్రజలు బీజేపీ నాయకత్వాన్ని తిరస్కరించారని ప్రశాంత్ కిషోర్ అన్నారు. గెలుపు అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నిక కేవలం ఒక ఎమ్మెల్యేను ఎన్నుకునేందుకు మాత్రమే జరిగినది కాదన్నారు. బీహార్ నాయకత్వంపై ప్రజలు ఇచ్చిన స్పష్టమైన సందేశమని, బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి నాయకత్వాన్ని రాష్ట్ర ప్రజలు తిరస్కరించారని తెలిపారు. నేరపూరిత ధోరణులు, వివాదాస్పద ప్రవర్తన ఉన్న వ్యక్తికి బీజేపీ నాయకత్వాన్ని అప్పగించిందని, ఇలాంటి నాయకత్వాన్ని బీహార్ ప్రజలు అంగీకరించరని చెప్పారు. ప్రజలిచ్చిన తీర్పును బీజేపీ గౌరవంగా స్వీకరిస్తుందని ఆ పార్టీ బీహార్ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ సరగోయ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రజా తీర్పు అన్నింటికంటే అతీతమైనదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష పార్టీల్లా రాజ్యాంగ వ్యవస్థలను లేదా ఈవీఎంలను, ఎన్నికల కమిషన్‌ను తాము విమర్శించబోమని అన్నారు.

**మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్, గుజరాత్‌లో బీజేపీ అభ్యర్థుల గెలుపు**

మధ్యప్రదేశ్‌లోని దాతియా నియోజకవర్గం ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఘన్‌శ్యామ్ సింగ్ విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి ఆశుతోష్ తివారిపై 6,016 ఓట్ల తేడాతో ఘన్‌శ్యామ్ గెలుపొందారు. ఆయనకు 66,757 ఓట్లు పోలయ్యాయి. ఆజాద్ సమాజ్‌పార్టీకి చెందిన దామోదర్ యాదవ్‌కు సుమారు 22 వేల ఓట్లు పోలయ్యాయి. గుజరాత్‌లోని మంజల్‌పూర్ నియోజకవర్గాన్ని బీజేపీ నిలబెట్టుకుంది. వడోదర జిల్లాలో ఉన్న ఆ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి సతీశ్ పటేల్ గెలుపొందారు. మాజీ మంత్రి యోగేశ్ పటేల్ జూన్ 2న మృతిచెందడంతో ఆ సీటుకు ఉప ఎన్నిక నిర్వహించారు. మంజల్‌పూర్ ఎన్నికలో కాంగ్రెస్, బీజేపీ మాత్రమే పోటీలో నిలిచాయి. గతం కంటే బీజేపీకి ఈ ఉపఎన్నికల్లో ఓట్లు తగ్గటం గమనార్హం.

# ప్రాజెక్టుల జలకళ

**మొదటిపేజీ తరువాయి**

పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచ నా వేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 1.49 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా... 800 క్యూసెక్కులను ఎత్తిపోతల పథకాల ద్వారా బయటకు తరలిస్తున్నారు. శ్రీశైలం జలాశయం పూర్తిసామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా... ప్రస్తుతం 92.04 టీఎంసీల నీరు ఉంది. జలాశయంలోకి రోజూ దాదాపు 13 టీఎంసీలకు పైగా వరద జలాలు వస్తున్నాయి. వరద ఇలాగే కొనసాగితే పదిరోజుల్లో పూర్తిగా నిండే అవకాశం ఉంది. మరోవైపు గోదావరి నదిలో క్రమంగా వరద తగ్గుతున్నప్పటికీ.. కృష్ణానదిలో కంటే అధికంగానే ఉంది. మేడిగడ్డ బ్యారేజీకి 2.55 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, వచ్చిన వరదను వచ్చినట్లే దిగువకు వదులుతున్నారు. సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం)కు 4.12 లక్షల క్యూసెక్కులు, దుమ్ముగూడెం(సీతమ్మసాగర్)కు 7.12 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది.

రాష్ట్రంలో విచిత్ర వాతావరణం నెలకొంది. జూలై చివరివారంలో నాలుగైదు రోజులపాటు వర్షం వదలకుండా పడగా.. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతున్నాయి. పగలంతా తీవ్ర వేడి, ఉక్కపోత వాతావరణం ఉంటూ.. సాయంత్రం కాగానే వర్షం పడుతోంది. సోమవారం 27 జిల్లాల్లో 35 డిగ్రీలకుపై గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సూర్యాపేట జిల్లా మునగాలలో అత్యధికంగా 38.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మరో వారంపాటు ఇవే పరిస్థితులు ఉంటాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. అన్ని జిల్లాల్లో బలమైన ఉపరితల గాలులు వీస్తాయని చెప్పారు. 9వ తేదీ వరకు రాష్ట్రంలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. సోమవారం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. మెదక్ జిల్లా పాపన్నపేటలో 6 సె.మీ వర్షపాతం నమోదైంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. కొడంగల్‌లో 10.13 సె.మీ వర్షం పడింది.

**హైదరాబాద్‌లో భారీ వర్షం**

హైదరాబాద్‌లో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. కాప్రా, ఉప్పల్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్, రాణిగంజ్ ప్రాంతాల్లో రోడ్లపై మోకాళ్లలోతు వరదనీరు నిలిచిపోవడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో రాత్రి 10 గంటల వరకు వర్షం పడుతూనే ఉంది. కాప్రాలో 6.9 సెం.మీ, ఏఎవీసరావునగర్‌లో 4, ఉప్పల్‌లో 4 సెం.మీ వర్షం కురిసింది. ఉద్యోగులు విధులు ముగించుకొని ఇళ్లకు వెళ్లే సమయంలో వర్షం కురవడంతో పలు ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. జూబ్లీహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, జేఎన్టీయూ, కూకట్‌పల్లి ప్రాంతాల్లో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు, మున్సిపల్ సిబ్బంది రోడ్లపై నీటిని తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

# "మిస్టర్ డ్రామారావు"

## కేటీఆర్ పై మంత్రి పొంగులేటి ఫైర్

పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, ఉద్యమకారుడైన పెద్ది సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించిందని పొంగులేటి ఆరోపించారు. ఎమ్మెల్యేగా ఓటమి పాలైన తర్వాత ఆయనకు కనీసం రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ పదవి అయినా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. సంతోష్ రావు, దామోదర్ రావు వంటి వారికి పదవులు కట్టబెట్టిన బీఆర్ఎస్ నాయకత్వం, పెద్ది సుదర్శన్ రెడ్డిని ఎందుకు విస్మరించిందని ఆయన ప్రశ్నించారు.




తమ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ది సుదర్శన్ రెడ్డిని వైద్య చికిత్స కోసం వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసిందని, ఆయన అంత్యక్రియలను అధికారిక పోలీసు లాంఛనాలతో నిర్వహించి గౌరవించిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తుచేశారు. ఉద్యమకారులను కేవలం ఓట్ల కోసం వాడుకుని, అధికారం, కీలక పదవులన్నీ కల్వకుంట్ల కుటుంబమే అనుభవించడం బీఆర్ఎస్‌కు అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. మరణాలను సైతం రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్న బీఆర్ఎస్ పార్టీకి రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు మరోసారి గుణపాఠం చెప్పడం ఖాయమని పొంగులేటి ధ్వజమెత్తారు.

# 2 లక్షల ఉద్యోగాలు ఎప్పుడిస్తారో చెప్పాలి

**మొదటిపేజీ తరువాయి**

చేయడమే కాంగ్రెస్ పార్టీ చేసిన "క్రిమినల్ వేస్ట్"అని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు, నిరుద్యోగులను మోసం చేసినందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి యువతకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం 16,978 ఉద్యోగాలనే మాత్రమే భర్తీ చేసిందన్నారు. అందులోనూ బీఆర్ఎస్ ఇచ్చిన నోటిఫికేషన్లను తీసేస్తే 10 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని వివరించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఎప్పుడిస్తారో సమాధానం చెప్పాలని రాహుల్‌గాంధీని, రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రిగా రేవంత్ రెడ్డి సాధించిన విజయం అంటే 150 మంది గురుకుల విద్యార్థుల మరణాలా? లేక ఉద్యోగాలు అడిగిన నిరుద్యోగులకు "ఎండ్రిన్ తాగి చావండి" అనే పరిస్థితి కల్పించడమా?అని ప్రశ్నించారు. 21 ఏండ్లకే చట్టసభల్లో ప్రవేశానికి అవకాశం కల్పించాలంటూ మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే వెంటనే విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసి ఆ బాధ్యతలను యువకుడికి అప్పగించాలని సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రజల దృష్టి మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన చేతిలో లేని అంశాలపై మాట్లాడుతున్నారని విమర్శించారు. 21 ఏండ్ల అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేసినా అది ప్రజలకు ఎలాంటి ఉపయోగం ఉండబోదని స్పష్టం చేశారు.

జాబులు లేని క్యాలెండర్

ఎన్నికల సమయంలో నిరుద్యోగులను కేవలం ఓట్ల కోసం ఉపయోగించుకోవడం కాంగ్రెస్ పార్టీకి దశాబ్దాలుగా అలవాటేనని కేటీఆర్ విమర్శించారు. యూత్ డిక్లరేషన్ సహా అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా యువతను మోసం చేసిందని చెప్పారు. ఉద్యోగాల పేరుతో అసెంబ్లీలో పెట్టింది జాబ్ క్యాలెండర్ కాదనీ,"జాబులు లేని క్యాలెండర్" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

యువత ఎట్టి పరిస్థితుల్లోనూ నిరాశ చెందొద్దనీ, ఒత్తిడికి గురికావొద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఎవరూ ఆత్మహత్యలు లేదా బలవన్మరణాలకు పాల్పడొద్దని కోరారు. రాబోయే బీఆర్ఎస్ ప్రభుత్వంలో యువత ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీతోపాటు వారి భవిష్యత్తుకు అండగా నిలిచే విధానాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఇంజినీరింగ్ విద్యార్థులు, చదువుకున్న యువతను "క్రిమినల్ వేస్ట్" అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవమానించడంపై రాహుల్‌గాంధీ ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు.

ఎన్నికల అఫిడవిట్ నింపే తెలివి ఉందా?

విద్యార్థులను, యువతను అవమానించే అర్హత రేవంత్ రెడ్డికి లేదని కేటీఆర్ అన్నారు. ఆయన జీవితంలో ఎప్పుడైనా పోటీ పరీక్ష రాశారా? కనీసం ఉద్యోగానికి దరఖాస్తు ఫారం నింపారా? అని ప్రశ్నించారు. ఆయన ఎన్నికల అఫిడవిట్‌ను సైతం స్వయంగా నింపే తెలివి రేవంత్‌కు ఉందా? అని సవాల్ విసిరారు. లక్షలాది మంది విద్యార్థులను "క్రిమినల్ వేస్ట్" అనడం అత్యంత అవమానకరమని అన్నారు. రాష్ట్రంలో నిర్మితమైన ప్రాజెక్టులు, రోడ్లు, భవనాలు, సచివాలయం, కమాండ్ కంట్రోల్ సెంటర్, రూ.200 కోట్ల జూబ్లీహిల్స్‌లోని బోధి ప్యాలెస్ వంటి నిర్మాణాలన్నీ ఇంజినీర్ల ప్రతిభ ఫలితమేనని గుర్తు చేశారు. అలాంటి ఇంజినీర్లనే అవమానించిన రేవంత్ రెడ్డి వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వారికి భవనాలు నిర్మించడం మాత్రమే కాదనీ, అవమానించిన నాయకులకు, ఆ పార్టీలకు రాజకీయంగా సమాధి కట్టడం కూడా తెలుసని అన్నారు.

అసెంబ్లీలో ఉద్యోగాల గురించి అడుగుతాం

అసెంబ్లీ సమావేశాలను 15 రోజులపాటు నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. యువతకు ఇచ్చిన హామీల అమలు, ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగుల సమస్యలపై ప్రత్యేకంగా చర్చ జరపాలని కోరారు. ప్రభుత్వం ఇందుకు సిద్ధం కాకపోతే యువతకు చేసిన ద్రోహాన్ని అసెంబ్లీలో బీఆర్ఎస్ తరఫున గట్టిగా నిలదీస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో ఐటీ రంగం క్షీణించడానికి కూడా ప్రభుత్వ వైఫల్యమే కారణమని అన్నారు. తెలంగాణ ఐటీ ప్రగతి తిరోగమనంలోకి వెళ్లిందన్నారు.

అవి కాళేశ్వరంలో భాగం కాదా?

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం అబద్ధాలు ప్రచారం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. ఎల్లంపల్లి రిజర్వాయర్ నిండిందని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, అక్కడి నుంచి మిడ్ మానేరు వరకు నీరు ఎలా వస్తోందో చెప్పాలని డిమాండ్ చేశారు. గాయత్రి పంప్ హౌస్, మేడారం పంపింగ్ వ్యవస్థను ఎవరు నిర్మించారో, అవి కాళేశ్వరం ప్రాజెక్టులో భాగం కాదా అని సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే రివర్స్ పంపింగ్, మానేరు నుంచి ఎస్ఆర్ఎస్‌పీకి నీటిని తరలించే కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తోందని చెప్పారు.

భూముల కోసమే మెట్రో స్వాధీనం

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టును కూడా రాష్ట్ర ప్రయోజనాల కోసం కాకుండా కొందరి వ్యక్తిగత ప్రయోజనాల కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని కేటీఆర్ ఆరోపించారు. ప్రయివేట్ కంపెనీ అప్పులను రాష్ట్ర ప్రజలపై మోపే ప్రయత్నం జరుగుతోందన్నారు. మెట్రో భూములను కొల్లగొట్టేందుకే ఈ ప్రయత్నం చేస్తోందని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో మెట్రో విస్తరణకు అభ్యంతరం చెప్పని కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు వ్యతిరేకిస్తోందో, మెట్రోను స్వాధీనం చేసుకోవాలన్న ప్రభుత్వ ఉద్దేశం ఏంటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితోపాటు బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తోందని అన్నారు.

**మొదటిపేజీ తరువాయి**

## రాయలసీమ వనరులు తీవ్రంగా దోపిడీకి గురయ్యాయి

స్థితిగతులు, ఎదుర్కొంటున్న సవాళ్లు మరియు భవిష్యత్ కార్యాచరణపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి రాయలసీమ ప్రాంతం తీవ్ర వెనుకబాటుతనానికి గురైందని, ఇక్కడి ప్రాకృతిక, మానవ వనరులు దోపిడీకి గురయ్యాయని అన్నారు.

ఈ ప్రాంతం నుంచి ఎందరో ముఖ్యమంత్రులు ప్రాతినిధ్యం వహించినప్పటికీ.. రాయలసీమ అభివృద్ధిలో ఎందుకు వెనుకబడిపోయిందో అర్థం కాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వెనుకబాటుతనాన్ని అధిగమించేందుకు నాయకులు, మేధావులు ఒకే తాటిపైకి వచ్చి సీమ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచించాలని పిలుపునిచ్చారు.

సీమ పురోగతి కోసం ఆయన 'ప్రజలు, పాడిపంటలు, పరిశ్రమలు, పర్యాటకం, పర్యావరణం' విధానాన్ని సూచించారు. వచ్చే 20 ఏళ్లలో రాయలసీమను ఏ విధంగా అభివృద్ధి చేయాలనే దానిపై సమగ్ర డాక్యుమెంటరీని రూపొందించడమే కాకుండా, దాన్ని ఆచరణలో సాధించి తీరాలని అన్నారు.

## చక్రవర్తి తన డిగ్రీ చూపిస్తారా?

పత్రాలను బహిరంగంగా చూపించడానికి తాను సిద్ధమని, మరి బీజేపీ నేతలు కూడా తమ విద్యార్హతలను వెల్లడిస్తారా? అంటూ ఆయన సోమవారం ప్రశ్నించారు. "నాకు వచ్చిన స్కాలర్‌షిప్ లేఖను, విద్యా రుణం తీసుకున్న లేఖను చూపించడానికి నేను సిద్ధమే, మరీ మీ చక్రవర్తి కూడా తన డిగ్రీ చూపిస్తారా?' అని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. బోస్టన్‌లో పబ్లిక్ రిలేషన్స్‌లో కోర్సు పూర్తి చేసిన దీప్కే కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి నేతృత్వం వహించేందుకు జూన్‌లో భారత్‌కు తిరిగి వచ్చారు. నీట్ పేపర్ లీకేజీపై విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 6వ తేదీన జంతర్ మంతర్ వద్ద ఆయన ఆందోళన ప్రారంభించారు. తొలుత నిరాహార దీక్షగా ప్రారంభమైన ఈ ఉద్యమం దాదాపు రెండు మాసాల వ్యవధిలోనే జాతీయస్థాయిలో ఉద్యమంగా రూపుదిద్దుకున్న సంగతి తెలిసిందే.ప్రభుత్వం తనపై ఏ దర్యాప్తు నిర్వహించాలనుకున్నా అందుకు తాను సిద్ధమేనంటూ దీప్కే ప్రభుత్వాన్ని సవాలు చేశారు. "ఏ వ్యక్తి అయినా ఈ ప్రభుత్వాన్ని సవాలు చేస్తే వెంటనే ఆ వ్యక్తిని వేధించేందుకు ఈడీ, సీబీఐ, ఇతర సంస్థలను పంపిస్తుంది. ఒకవేళ ప్రధాని నా వద్దకు ఈడీని పంపించాలనుకుంటే, ప్రధాని తన డిగ్రీ సర్టిఫికెట్ కాపీని కూడా పంపించాలి. అప్పుడు నేను కూడా నా విద్యా రుణం, స్కాలర్‌షిప్ వివరాలు, డిగ్రీ సర్టిఫికెట్‌ను బహిరంగపరుస్తాను." అని ఆయన ఛత్రపతి శంభాజినగర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ స్పష్టం చేశారు.రాజకీయ పార్టీని ఏర్పాటు చేసే ఉద్దేశం ఉందా అంటూ విలేకర్లు అడిగిన ప్రశ్నపై దీప్కే స్పందిస్తూ, రాజకీయ పార్టీని ఏర్పాటు చేసేందుకు మా కంటే కూడా మీడియా చాలా ఆత్రంగా వుందని వ్యాఖ్యానించారు. "ప్రస్తుతం ఈ దేశంలో వున్న రాజకీయ పార్టీల సంఖ్యను చూసినట్లైతే, మీరు కూడా నిరాశపడి వుంటారని అనిపిస్తోంది. అయినా దీన్ని ఒక సామాజిక ఉద్యమంలా కొనసాగించాలన్నదే మా అభిమతం. దేశంలో ప్రస్తుతమున్న రాజకీయ స్థితిగతులను చూస్తున్నాం కదా, మరో పార్టీని ఏర్పాటు చేసి ఏం లాభం." అని ఆయన వివరించారు. జార్ఖండ్‌లోని విద్యార్థుల ఆందోళనలకు కాక్రోచ్ జనతా పార్టీ మద్దతు వుంటుందని దీప్కే ప్రకటించారు. వారితో తాను మాట్లాడానని చెప్పారు. ఇటీవల నిర్వహించిన ప్రభుత్వ రిక్రూట్‌మెంట్ పరీక్షల్లో అవకతవకలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ఆ డిమాండ్లు పరిష్కారమయ్యేవరకు వెనక్కి తగ్గవద్దని వారిని కోరానని చెప్పారు.

## కర్ణాటక కేబినెట్ విస్తరణతో కాంగ్రెస్‌లో తీవ్ర అసమ్మతి

మంత్రి పదవుల ఖరారులో కాంగ్రెస్ అధిష్ఠానం చివరి నిమిషంలో మార్పులు చేయడంతో, పదవులు ఆశించి భంగపడిన పలువురు ఎమ్మెల్యేలు బహిరంగంగానే తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రాజీనామాకు సిద్ధమవగా, మరికొందరి మద్దతుదారులు ఆందోళనలకు దిగారు.

సోమవారం నాడు మొత్తం 20 మంది శాసనసభ్యులతో మంత్రివర్గాన్ని విస్తరించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అయితే, తుది జాబితా నుంచి మంకాల్ ఎస్. వైద్య పేరును తొలగించి, ఆయన స్థానంలో సీనియర్ లింగాయత్ నేత, మాజీ మంత్రి ఎస్.ఎస్. మల్లికార్జున్‌ను చేర్చడం వివాదానికి దారితీసింది. ప్రాంతీయ, సామాజిక సమీకరణాలను సమతుల్యం చేసేందుకే ఈ మార్పు చేసినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.మంత్రి పదవి దక్కకపోవడంపై ఇండి నియోజకవర్గ ఎమ్మెల్యే యశ్వంత్ రాయగౌడ పాటిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి నిమిషం వరకు హామీ ఇచ్చి మోసం చేశారని, ఇది తనపై జరిగిన పెద్ద కుట్ర అని ఆయన ఆరోపించారు. స్పీకర్‌కు సమర్పించేందుకు తన రాజీనామా లేఖను కూడా సిద్ధం చేసుకున్నట్లు వెల్లడించారు. మరో ఎమ్మెల్యే, మాజీ మంత్రి బేలూరు గోపాలకృష్ణ సైతం తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. పార్టీకి విధేయులుగా ఉన్న వారిని విస్మరించి, రాజకీయ పలుకుబడి ఉన్న కుటుంబాలకే ప్రాధాన్యం ఇచ్చారని ఆయన విమర్శించారు.

## జోగినులకు అండగా ప్రభుత్వం

తెలంగాణ ప్రజలందరికీ ఇది అత్యంత శుభదినమని, అమ్మవారి దివ్య ఆశీస్సులతో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మంత్రి ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, విశిష్ట సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల జాతరను ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిందని తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కాస్త ఒత్తిడి పెరిగినప్పటికీ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో సేవలందించారని కొనియాడారు.జోగినులకు సమాజంలో తగిన గుర్తింపు కల్పించే దిశగా ప్రభుత్వం సానుకూలంగా అడుగులు వేస్తోందని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో జోగినులను మున్సిపాలిటీల్లో కో-ఆప్షన్ సభ్యులుగా నియమించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో దేవాదాయ, హోం, మున్సిపల్ శాఖల సమన్వయంతో బోనాల ఏర్పాట్లను మరింత వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. జోగినులకు అధికారిక గుర్తింపు కల్పించడంపై సంబంధిత శాఖ మంత్రితో చర్చించి త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తామని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## నిర్దోషిగా బ్రిజ్‌భూషణ్

అవి రుజువైతే ఉరి వేసుకుంటానని. ఈ రోజు కోర్టు నన్ను గౌరవప్రదంగా నిర్దోషిగా తేల్చింది. జరిగిందేదో జరిగిపోయింది" అని ఆయన వ్యాఖ్యానించారు.డబ్ల్యూఎఫ్ఐ చీఫ్‌గా ఉన్నప్పుడు బ్రిజ్ భూషణ్ తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ పలువురు మహిళా రెజ్లర్లు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నిరసనల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. విచారణ పూర్తి చేసిన అనంతరం 2023 జూన్ 15న సుమారు 1500 పేజీల ఛార్జ్‌షీట్‌ను కోర్టులో దాఖలు చేశారు.భారత రెజ్లింగ్ సమాఖ్య అధిపతిగా ఉన్న సమయంలో స్వదేశీ, విదేశీ మహిళా రెజ్లర్ల పట్ల బ్రిజ్ భూషణ్ అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపణలు వచ్చాయి. సుదీర్ఘ విచారణ అనంతరం కోర్టు ఆయనను, సహ నిందితుడు వినోద్ తోమర్‌ను నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పు ఇచ్చింది.

జర్నలిస్ట్ వార్త
మంగళవారం 4 ఆగస్టు 2026

# వేలేరులో ఉచిత కంటి పరీక్షల శిబిరం

## పెద్ద సంఖ్యలో తరలివచ్చిన గ్రామస్తులు.. పరీక్షలు నిర్వహించిన వైద్య బృందం

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఆగస్టు 3 (జర్నలిస్ట్ వార్త):**హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం వేలేరు మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం సుస్మిత కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బిల్లా యాదగిరి శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామస్తులకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ కంటి సంబంధిత సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే పరీక్షలు చేయించుకోవడం ద్వారా తీవ్ర సమస్యలను నివారించవచ్చని అన్నారు. గ్రామంలో ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించాలని కోరిన వెంటనే స్పందించి సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సుస్మిత కంటి ఆసుపత్రి యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి వైద్య శిబిరాలు గ్రామీణ ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని, ప్రజలు వీటిని



సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో వైద్య బృందం గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు, వైద్య సూచనలు అందించింది. శస్త్రచికిత్స అవసరమైన రోగులను గుర్తించి తదుపరి చికిత్స కోసం ఆసుపత్రికి రావాలని సూచించారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు హాజరై ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకర్,



గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ, వార్డు సభ్యులు ప్రశాంత్, చైతన్య, సురేష్, సునీల్, సుస్మిత కంటి ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ అనూష, సిబ్బంది అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# రెండో రోజూ ఉపాధి హామీ సిబ్బంది పెన్‌డౌన్

## ధర్మసాగర్ మండలంలో స్తంభించిన పనులు.. -సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని ఉద్యోగుల హెచ్చరిక

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఆగస్టు 3 (జర్నలిస్ట్ వార్త):**మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) ఉద్యోగుల రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ధర్మసాగర్ మండలంలో చేపట్టిన పెన్‌డౌన్, షట్‌డౌన్ ఉద్యమం సోమవారం రెండో రోజుకు చేరుకుంది. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం విధులను పూర్తిగా బహిష్కరించిన ఉద్యోగులు కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యమం కొనసాగుతుండటంతో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పరిపాలనా, సాంకేతిక సేవలు స్తంభించగా, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల పర్యవేక్షణ కూడా ప్రభావితమైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించడంతో పాటు చెరువుల పూడికతీత,




మట్టి పనులు, కాలువల అభివృద్ధి, మొక్కల పెంపకం, సీసీ రోడ్ల నిర్మాణం తదితర పనుల అమలులో ఉపాధి హామీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే పెన్‌డౌన్ కారణంగా మస్టర్ల నమోదు, పనుల కొలతలు, సాంకేతిక అనుమతులు, బిల్లుల ప్రక్రియ, వేతనాల చెల్లింపులకు సంబంధించిన పనులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం ఎన్నిసార్లు దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించకపోవడంతో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన బాట పట్టామని వారు తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఉద్యోగ భద్రత, వేతనాల సమస్యలు, సేవా నిబంధనలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్లు పి. సతీష్, వి. సునీత, టెక్నికల్ అసిస్టెంట్లు ఎం. వెంకన్న, కె. మధుకర్, ఈ. అశోక్, జూనియర్ ఇంజనీర్ చిలుక శ్రీనివాస్, అదనపు ప్రోగ్రాం అధికారి ఎం. సంపత్ పాల్గొన్నారు. ప్రభుత్వం తక్షణమే చర్చలకు ఆహ్వానించి తమ న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# చెప్పిన మాట నిలబెట్టుకున్న నామ

## వేణుకుమార్ కుటుంబానికి ట్రస్ట్ ద్వారా రూ.50 వేల సాయం

## ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కావు.. నిరుద్యోగులు ధైర్యంగా ఉండాలి: మాజీ ఎంపీ

**ఖమ్మం/ ఆగస్టు 3 (జర్నలిస్ట్ వార్త):**
ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నిరుద్యోగ యువకుడు జీ. వేణుకుమార్ కుటుంబానికి మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు అండగా నిలిచారు. ఆదివారం ఆస్పత్రిలో పరామర్శించిన సందర్భంగా కుటుంబానికి భరోసా ఇచ్చిన ఆయన, చెప్పిన మాటను నిలబెట్టుకుంటూ మరుసటి రోజే తన నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు.

ముదిగొండ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన వేణుకుమార్ గ్రూప్స్ నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడంపై మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజుతో కలిసి బాధితుడిని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న నామ స్పందించి ట్రస్ట్ ద్వారా రూ.50 వేల సాయాన్ని అందజేయాలని నిర్ణయించారు. సోమవారం మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, ట్రస్ట్ ప్రతినిధి కనకమేడల సత్యనారాయణ



చేతుల మీదుగా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించారు. క్లిష్ట సమయంలో అండగా నిలిచిన నామకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదని, నిరుద్యోగ యువత ఎట్టి పరిస్థితుల్లోనూ అలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ధైర్యంగా పోరాడాలని, నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. లక్షలాది నిరుద్యోగుల ఆవేదనకు ప్రభుత్వం సమాధానం చెప్పాలిలింగాల కమల్‌రాజు మాట్లాడుతూ.. వేణుకుమార్ ఘటన ఒక్కరి వ్యక్తిగత సమస్య కాదని, రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న ఆవేదనకు ప్రతిబింబమని



అన్నారు. ఉద్యోగాల పేరుతో హామీలు ఇచ్చిన ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న గ్రూప్స్‌తో పాటు అన్ని ఉద్యోగ నోటిఫికేషన్లను వెంటనే విడుదల చేసి నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వేణుకుమార్ కోలుకున్న తర్వాత అతనికి అవసరమైన కోచింగ్, ఇతర సహాయ సహకారాలు కూడా బీఆర్ఎస్ పార్టీ అందిస్తుందని కమల్‌రాజు తెలిపారు. కార్యక్రమంలో మోరంపూడి ప్రసాద్‌రావు, గడ్డం వెంకటేశ్వర్లు, వాకదాని కోటేశ్వరరావు, పెనుగొండ కొండలు, నాగరాజు, రేగళ్ల కృష్ణప్రసాద్, పగడాల రవికుమార్, షారుఖ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడికి సన్మానం..

**బయ్యారం/,ఆగస్టు 3.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఇటీవల నూతనంగా ఎన్నికైన జులకంటి సీతారాం రెడ్డి ని సింగారం సర్పంచ్ సరస్వతి రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు సీతారాం రెడ్డి కి శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతానికి ఆయన సమర్థవంతంగా కృషి చేసి ప్రజల సమస్యల పరిష్కారంలో




ముందుండాలని ఆకాంక్షించారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చంచు మమత,వార్డు సభ్యులు చెరుకుపల్లి మనీషా,గుగులోత్ అనూష,సపవత్ అనిత,విద్యాకమిటి చైర్మన్ గుగులోత్ స్వరూప,మాజీ ఎంపీటీసీ గోపాల్ నాయక్,గ్రామ అధ్యక్షుడు గంగావత్ రవి నాయక్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు చాట్ల వెంకన్న,చెరుకుపల్లి రవి,చుంచు సాయికిరణ్,గంగవత్ రాంకీ నాయక్,బాలరాజు, సపవత్ సంతోష్ నాయక్,ఉపలయ్య,తదితరులు పాల్గొన్నారు.

# వీధికుక్కల దాడిలో చిన్నారి తీవ్రంగా గాయాలు

## భరణిపాడులో ఘటన.. నియంత్రణ చర్యలు చేపట్టాలని గ్రామస్తుల విజ్ఞప్తి

**వేంసూరు/ఆగస్టు 3 (జర్నలిస్ట్ వార్త):** ఇంటి ముందు అమాయకంగా ఆడుకుంటున్న ఆరేళ్ల చిన్నారిపై వీధికుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ఘటన ఖమ్మం జిల్లా వేంసూరు మండలం భరణిపాడు గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఈ ఘటనతో గ్రామంలో ఒక్కసారిగా భయాందోళన నెలకొంది.

గ్రామానికి చెందిన గుల్లపూడి నరసింహారావు కుమార్తె ఇంటి ఎదుట ఆడుకుంటుండగా, అటుగా సంచరిస్తున్న వీధికుక్కలు ఒక్కసారిగా ఆమెపై దాడి చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ దాడిలో చిన్నారి ఛాతీ, పొట్ట భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే చిన్నారిని వేంసూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. ఈ ఘటనతో భరణిపాడు గ్రామ ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో వీధికుక్కల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, రహదారులపై స్వైరవిహారం చేస్తూ



పాదచారులు, చిన్నారులు, వృద్ధులపై దూకుడుగా వ్యవహరిస్తున్నాయని వారు పేర్కొన్నారు. పశువులు, కోళు వంటి పెంపుడు జంతువులపై కూడా దాడులు చేస్తున్నాయని, ద్విచక్ర వాహనాలను వెంటాడడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు తరచూ జరుగుతున్నాయని తెలిపారు. వీధికుక్కల సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం లభించలేదని గ్రామస్తులు వాపోయారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న వీధికుక్కల నియంత్రణకు సంబంధిత శాఖలు తక్షణ చర్యలు చేపట్టాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ఎల్లాపూర్ భూ వివాదంపై విచారణ కోరిన గ్రామస్తులు

## గ్రామసభ నిర్వహించి వాస్తవాలు వెల్లడించాలని విజ్ఞప్తి

**హసన్‌పర్తి/ఆగస్టు 3 (జర్నలిస్ట్ వార్త):**
65వ డివిజన్ పరిధిలోని ఎల్లాపూర్ గ్రామంలో సర్వే నంబర్ 246కు సంబంధించిన భూమి అంశంపై సమగ్ర విచారణ నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించినట్లు గంగిళ్ల వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, సర్వే నంబర్ 246లో 12 ఎకరాల 13 గుంటల భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులపై కొన్ని అనుమానాలు



ఉన్నాయని పేర్కొన్నారు. పట్టాదారులు మరణించిన అనంతరం కూడా ఈ-కేవైసీ నమోదు జరిగినట్లు తమకు సమాచారం అందిందని, దీనిపై సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద వివరణ కోరినట్లు తెలిపారు. ప్రజావాణిలో ఈ అంశాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, సంబంధిత రెవెన్యూ అధికారులను వివరణ కోరినట్లు చెప్పారు. అనంతరం విషయం సంబంధిత అధికారుల పరిశీలనకు వెళ్లినట్లు తెలిపారు. ఈ భూమికి సంబంధించిన రికార్డులను సమగ్రంగా పరిశీలించి, అవసరమైతే గ్రామసభ నిర్వహించి ప్రజల సమక్షంలో వాస్తవాలను వెల్లడించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రభుత్వ భూములకు సంబంధించి ఎలాంటి సందేహాలు తలెత్తకుండా పారదర్శక విచారణ చేపట్టి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రేణుకుంట్ల దుర్గాప్రసాద్, వెలిసోజు బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ కవచం

## ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో అవగాహన.. టీకాల కార్యక్రమం నిర్వహణ




**కల్లూరు/ఆగస్టు 3 (జర్నలిస్ట్ వార్త):** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా కల్లూరు మండలంలోని చంద్రుపట్ల, రఘునాథగూడెం గ్రామపంచాయతీల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై వివరించడంతో పాటు శిశువుల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. చంద్రుపట్ల సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత మాట్లాడుతూ, పుట్టిన వెంటనే శిశువుకు ముర్రుపాలు పట్టించడం అత్యంత అవసరమని చెప్పారు. ముర్రుపాలలో శిశువుకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా ఉండటంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. తల్లిపాల వల్ల తల్లిబిడ్డల మధ్య భావోద్వేగ అనుబంధం మరింత బలపడుతుందని, తొలి ఆరు నెలలు తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆహారమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో రఘునాథగూడెం సర్పంచ్ సుధారాణి, ఉపసర్పంచ్, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, పద్మ, రేవతి, యశోద, లక్ష్మి, మంగమని, ప్రియాంక, కృష్ణవేణి, గర్భిణులు, బాలింతలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

# టీసీసీ సమావేశంలో సేవకులకు దిశానిర్దేశం

## ఆరు మండలాలకు నూతన కమిటీల నియామకం

**దంతాలపల్లి/ఆగస్టు 3 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ (టీసీసీ) ఆధ్వర్యంలో ఆరు మండలాల పాస్టర్లు, క్రైస్తవ సేవకుల సమావేశం సోమవారం దంతాలపల్లిలోని జె. డేవిడ్ ప్రార్థనా మందిరంలో నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు రెవ. జోషప్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి టీసీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు బిషప్ ఎం.డి. సుదర్శనం ముఖ్య అతిథిగా హాజరై సంస్థ లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా వివరించారు. క్రైస్తవ సంఘాల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేయడంతో పాటు సేవా కార్యక్రమాలను గ్రామస్థాయిలో విస్తరించాల్సిన అవసరం ఉందని ఆయన




పేర్కొన్నారు. సమాజ సేవతో పాటు ఆధ్యాత్మిక విలువలను ప్రజల్లో పెంపొందించేందుకు ప్రతి పాస్టర్, ప్రతి సేవకుడు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. టీసీసీ ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్యక్రమాలకు ప్రతి మండలం నుంచి సహకారం అందించాలని కోరారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. కిరణ్ కుమార్ వాక్య సందేశం అందించగా, రాష్ట్ర కార్యదర్శి ఏసుదాసు, రాష్ట్ర కన్వీనర్ ఎం. నిరీక్షణరావు, రెవ. రామాచారి తదితరులు సంస్థ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై మాట్లాడారు. సమావేశం అనంతరం ఆరు మండలాలకు నూతన టీసీసీ కమిటీలను ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షులు, కార్యదర్శులు, ఖజాంచీలను బిషప్ ఎం.డి. సుదర్శనం ప్రకటించి నియామక పత్రాలను అందజేశారు. నూతన కమిటీలు క్రైస్తవ సంఘాల అభివృద్ధి, సేవా కార్యక్రమాల విస్తరణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ మండలాలకు చెందిన పాస్టర్లు, సంఘ పెద్దలు, క్రైస్తవ సేవకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..



# చైత్రకు ఏరుకొండ శ్రీనివాస్ ఆశీస్సులు



**హసన్‌పర్తి/ ఆగస్టు 3 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా 65వ డివిజన్ ఎల్లాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ జోనల్ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి బత్తుల సతీష్, చందన దంపతుల కుమార్తె చైత్ర నూతన వస్త్ర, ఫలక్ పుష్పాలంకరణ కార్యక్రమం ఆదివారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక ప్రజల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఏరుకొండ శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.ఈ సందర్భంగా చిన్నారి చైత్రకు నూతన వస్త్రాలు అందజేసి ఆశీస్సులు అందించిన ఏరుకొండ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, పిల్లలు కుటుంబాలకు భగవంతుడు ప్రసాదించిన అమూల్యమైన వరమని అన్నారు. చిన్నారులు మంచి ఆరోగ్యం, ఉన్నత విద్యతో ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. చైత్ర జీవితంలో ప్రతి అడుగులోనూ విజయాలు సాధిస్తూ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆశీర్వదించారు.అనంతరం బత్తుల సతీష్, చందన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసి, కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించారు. కార్యక్రమంలో పాల్గొన్న బంధుమిత్రులు చిన్నారికి బహుమతులు అందజేసి ఆశీస్సులు తెలిపారు. కార్యక్రమం ఆత్మీయ, ఆనందకర వాతావరణంలో కొనసాగింది.ఈ కార్యక్రమంలో డివిజన్ యువ నాయకులు బత్తుల రాజేందర్, బొర్ర సురేష్‌తో పాటు పలువురు రాజకీయ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, బంధుమిత్రులు పాల్గొని చిన్నారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఉద్యమకారుల గుర్తింపుపై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలి

### - తెలంగాణ సమరయోధులుగా గుర్తించాలని సుదర్శన్ డిమాండ్



**హసన్‌పర్తి/ఆగస్టు 3 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించి న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు కల్వచర్ల సుదర్శన్ డిమాండ్ చేశారు. ఉద్యమ సమయంలో బాధ్యతలు నిర్వర్తించిన వారిని గుర్తించి, వారి సేవలకు తగిన గౌరవం, ప్రోత్సాహకాలు కల్పించాలని కోరారు.
సోమవారం ఆయన మాట్లాడుతూ, కేకే కమిటీ సిఫార్సుల మేరకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఉన్న ఉద్యమకారుల కమిటీలను అధికారికంగా గుర్తించి వారికి ప్రాధాన్యం కల్పించాలని సూచించారు. కాలయాపన చేయకుండా ఉద్యమకారుల సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.భారత స్వాతంత్ర్య సమరయోధులకు ప్రభుత్వాలు జీవనభృతి, గౌరవం కల్పించినట్లే తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను కూడా లి'తెలంగాణ సమరయోధులు'లిగా గుర్తించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఉద్యమ ఫలితంగా రాష్ట్రం ఏర్పడినా, ఉద్యమకారుల త్యాగాలకు తగిన గుర్తింపు ఇంకా లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా హనుమకొండ 65వ డివిజన్ ఎల్లాపూర్ గ్రామ సమస్యలను కూడా ప్రస్తావించారు. మహిళలు బతుకమ్మ ఆడుకునేందుకు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయడంతో పాటు పెద్ద చెరువు వద్ద మెట్లు నిర్మించాలని కోరారు. గ్రామంలో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ శివారులోని సాంబ చెరువు సమీపంలో స్మశానవాటిక ఏర్పాటు చేయాలని, ఈ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించేందుకు గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు పార్టీలకతీతంగా కలిసి రావాలని సుదర్శన్ పిలుపునిచ్చారు.

# తెలంగాణకు వెలుగులు.. మాకు చీకట్లే!

### వైటీపీఎస్ వద్ద భూనిర్వాసిత రైతుల భారీ ధర్నా -ఉద్యోగం ఇస్తామన్న హామీ ఏమైంది? అంటూ ప్రభుత్వాన్ని నిలదీత





**నల్గొండ బ్యూరో/ ఆగస్టు 3 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణకు వెలుగులు అందించేందుకు మా భూములు ఇచ్చాం కానీ మా కుటుంబాల జీవితాల్లో మాత్రం ఇప్పటికీ చీకట్లే మిగిలాయి. భూములు తీసుకున్న తర్వాత మమ్మల్ని పూర్తిగా మర్చిపోయారు అంటూ నల్గొండ జిల్లా దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) భూనిర్వాసిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబానికి ఉద్యోగం కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం వైటీపీఎస్ ప్రధాన ద్వారం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు.పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం వేలాది ఎకరాల భూములను సేకరించిన సమయంలో ప్రతి భూనిర్వాసిత కుటుంబానికి ఉద్యోగం కల్పిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారని రైతులు తెలిపారు. ఆ హామీని నమ్మి తమ జీవనాధారమైన వ్యవసాయ భూములను అప్పగించామని, అయితే ప్లాంట్ నిర్మాణం పూర్తై విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైనా తమ కుటుంబాలకు మాత్రం ఉద్యోగాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ధర్నాలో పాల్గొన్న రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం చెల్లించిన పరిహారం తాత్కాలిక ఉపశమనమే తప్ప, శాశ్వత జీవనోపాధి కాదన్నారు. తమ భూములకు నిజమైన ప్రతిఫలం వైటీపీఎస్‌లో ఉద్యోగమేనని, ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల విషయంలో అధికారులు కాలయాపన చేస్తున్నారని, ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదని ఆరోపించారు.తెలంగాణ వెలుగుల కోసం మా భూములను త్యాగం చేశాం. రాష్ట్రానికి విద్యుత్ అందిస్తున్న ఈ ప్రాజెక్టు వల్ల అందరికీ ప్రయోజనం కలిగింది. కానీ భూములు కోల్పోయిన మా కుటుంబాల భవిష్యత్తు మాత్రం అంధకారంలోనే మిగిలిపోయింది. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుని వెంటనే ఉద్యోగాలు కల్పించాలి అని భూనిర్వాసితులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని, స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి భూనిర్వాసిత రైతులతో సమావేశమై ఉద్యోగాల అంశంపై స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ధర్నా సందర్భంగా భారీ ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంపై కూడా రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం ప్రశాంతంగా ఆందోళన చేస్తున్న తమను భయపెట్టేందుకు పోలీసు బలగాలను మోహరించడం సరికాదని అన్నారు. సమస్యను బలప్రయోగంతో కాకుండా చర్చల ద్వారా పరిష్కరించాలని కోరారు.భూనిర్వాసితుల ఆందోళనతో వైటీపీఎస్ ప్రధానద్వారం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఉద్యోగాల డిమాండ్‌పై ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది. భూనిర్వాసితుల డిమాండ్లపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

# దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

### అంబేద్కర్ అభయహస్తం అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి -హనుమకొండ కలెక్టరేట్ ఎదుట డీహెచ్‌పీఎస్ ధర్నా



**హనుమకొండ/ బ్యూరో ఆగస్టు 3 (జర్నలిస్ట్ వార్త):** ఎన్నికల సమయంలో దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ హాజరై మాట్లాడారు. అనంతరం డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి నిమ్మల మనోహర్, జిల్లా అధ్యక్షుడు రాజారపు రత్నం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత దళితుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి పలు హామీలు ఇవ్వబడినా, వాటి అమలు ఆశించిన స్థాయిలో జరగడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన దళిత సంక్షేమ హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.మేనిఫెస్టోలో ప్రకటించిన అంబేద్కర్ అభయహస్తం పథకం కింద ప్రతి అర్హ దళిత కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించినప్పటికీ, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా ఆ పథకం అమలుపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని పేర్కొన్నారు. దళితుల ఆశలను ప్రభుత్వం వమ్ము చేస్తోందని ఆరోపిస్తూ, ఇచ్చిన హామీల అమలుకు తక్షణ కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు, వివక్ష ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని నాయకులు పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థవంతంగా వ్యవహరించడం లేదని ఆరోపించారు. బాధిత కుటుంబాలకు వెంటనే న్యాయం చేయడంతో పాటు, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.
దళితుల భూముల రక్షణ, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య, గృహాలు, స్వయం ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఉప ప్రణాళిక నిధులను పూర్తిగా దళితుల సంక్షేమానికే వినియోగించాలని, ఖాళీగా ఉన్న ఎస్సీ రిజర్వేషన్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, భూమిలేని దళిత కుటుంబాలకు సాగుభూమి కేటాయించాలని కోరారు.ప్రభుత్వం తమ డిమాండ్లపై తక్షణమే స్పందించి అమలు చేయాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా పరిపాలన అధికారులకు అందజేశారు.ధర్నాలో డీహెచ్‌పీఎస్ నాయకులు, సీపీఐ నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువత, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# పట్టాలున్నా రైతులకు కష్టాలు..!

### అటవీశాఖ ఆంక్షలతో బయ్యారం రైతుల్లో ఆందోళన

### రైతుల జోలికి వస్తే కార్యాలయ ముట్టడే: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజి



**బెల్లంపల్లి,/ఆగస్టు 3 (జర్నలిస్ట్ వార్త):** దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూములకు ప్రభుత్వమే పట్టాలు మంజూరు చేసినప్పటికీ, అటవీశాఖ అధికారులు జోక్యం చేసుకోవడం, రైతులను పొలాల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడం, కేసులు నమోదు చేయడం బయ్యారం గ్రామ రైతుల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది. ఈ వ్యవహారంపై సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజి బీజేపీ నాయకులతో కలిసి బాధిత రైతుల భూములను పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 50 ఏళ్లుగా రైతులు నిరంతరంగా సాగు చేస్తున్న భూములకు ప్రభుత్వం చట్టబద్ధంగా పట్టాలు జారీ చేసిందని తెలిపారు. రెవెన్యూ రికార్డుల్లో రైతుల పేర్లు నమోదై ఉన్నప్పటికీ, అటవీశాఖ అధికారులు వాటిని పరిగణనలోకి తీసుకోకుండా రైతులను వేధించడం సరికాదన్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో రైతులు అనవసరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న రైతులను కేసుల పేరుతో భయపెట్టడం, సాగు పనులను అడ్డుకోవడం అన్యాయమన్నారు. అధికారులు రైతుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి వారిపైనే చర్యలకు దిగడం బాధాకరమని పేర్కొన్నారు. చట్టబద్ధమైన హక్కులు కలిగిన రైతులను ఇబ్బందులకు గురిచేస్తే బీజేపీ సహించబోదని స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై వెంటనే స్పందించి రైతులకు పూర్తి రక్షణ కల్పించాలని, అటవీశాఖ అధికారులు రైతులపై నమోదు చేసిన కేసులను సమీక్షించాలని డిమాండ్ చేశారు. రైతులు ప్రశాంతంగా వ్యవసాయం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అటవీశాఖ అధికారులు తమ వైఖరిని మార్చుకోకపోతే రైతులతో కలిసి కార్యాలయాన్ని ముట్టడిస్తామని, జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని కొయ్యల ఏమాజి హెచ్చరించారు. రైతుల హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అవసరమైతే న్యాయపోరాటం కూడా చేస్తామని తెలిపారు.భూముల పరిశీలన సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలను కొయ్యల ఏమాజి దృష్టికి తీసుకువచ్చారు. తరతరాలుగా సాగు చేస్తున్న భూముల్లోకి వెళ్లనీయకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని, కేసుల భయంతో వ్యవసాయ పనులు చేసుకోవడం కూడా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవికుమార్, పులగం తిరుపతి, కేశవరెడ్డి, గోవర్ధన్, లావణ్య, శ్రావణ్ కుమార్, నర్సింగ్, ముల్కల సత్యనారాయణ, ముడిమడుగుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# మిషన్ హరితోదయతో పచ్చదనానికి శ్రీకారం చుట్టిన శ్రీ చైతన్య స్కూల్.

**బయ్యారం/,ఆగస్టు 3.(జర్నలిస్ట్ వార్త)**
శ్రీ చైతన్య స్కూల్ 1 బ్రాంచ్ లో ప్రతినెలా నిర్వహిస్తున్న స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఈ నెల మిషన్ హరితోదయ అనే పేరుతో పర్యావరణ పరిరక్షణ,సామాజిక అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించామని పాఠశాల ప్రిన్సిపాల్ మదార్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల కోసం వ్యాసరచన పోటీ,సింగింగ్,డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్యాల ఆర్టికల్చర్ యూనివర్సిటీ హెడ్ సైంటిస్ట్ డాక్టర్ ఎ.ప్రశాంత్ కుమార్ హాజరై మొక్కలు నాటి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ హరితోదయ ప్రాముఖ్యతను ప్రస్తుత వర్షాభావ పరిస్థితులలో ఎల్-నినో ప్రభావం నుండి ఎలా బయటపడాలో, రైతులు ఏ పంటలు సాగు చేస్తే మేలు అనే విషయాన్ని వ్యవసాయ కుటుంబ విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయాలని వివరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను పాఠశాల సిబ్బందిని తెలంగాణ శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య,డీజీఎం చేతన్ మాధుర్,స్టేట్ అకాడమిక్ కోఆర్డినేటర్ జయరాజు,జోనల్ అకాడమీ కోఆర్డినేటర్ కృష్ణారావు లు అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ విద్యాసాగర్, సి బ్యాచ్ ఇంచార్జ్ మల్లేశం,ప్రైమరీ,ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ లు ప్రవల్లిక,షహనాజ్,సిసిఏ ఇంచార్జ్ కుమారస్వామి,ఏఓ సుధాకర్,పిఈటీ లు యాకయ్య,రాకేష్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.




# అభివృద్ధే ఎమ్మెల్యే లక్ష్యం.. ప్రతి హామీని నెరవేరుస్తాం



**: బండి ప్రభాకర్ యాదవ్**

**బెల్లంపల్లి/ ఆగస్టు 3 (జర్నలిస్ట్ వార్త):** బెల్లంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమమే ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ అన్నారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు సోమవారం పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా బండి ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 32 నెలల కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. తాగునీరు, రహదారులు, మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోందన్నారు. మిగిలిన 28 నెలల్లో ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ దశలవారీగా పూర్తి చేసి ప్రతి గ్రామం, ప్రతి వార్డు అభివృద్ధికి కృషి చేస్తారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంపై భారీగా పేరుకుపోయిన అప్పుల భారం కారణంగా అభివృద్ధి కార్యక్రమాల అమలులో కొంత జాప్యం జరిగినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై వెనుకడుగు వేయడం లేదన్నారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు.బడుగు, బలహీన వర్గాలు, రైతులు, మహిళలు, యువత, కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని బండి ప్రభాకర్ యాదవ్ అన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటి ఫలాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.పార్టీ నాయకులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు. ప్రజల విశ్వాసం, ఆశీస్సులతో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి బెల్లంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి కృషి చేస్తున్నారని తెలిపారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు, 34 వార్డుల ముఖ్య కార్యకర్తలు, మహిళా నాయకులు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అఖండ భజనకు భక్తులు తరలిరావాలి

**ఏక్కామ బోనం సందర్భంగా ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు -కౌన్సిలర్ తిరుమల వాస్‌కు ఆహ్వాన పత్రిక అందజేత**

**బెల్లంపల్లి/ఆగస్టు 3 (జర్నలిస్ట్ వార్త):** ఆషాఢమాస ఏక్కామ బోనం సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలోని కెమికల్ హనుమాన్ దేవాలయంలో శ్రీ నవనాగ సహిత మానసాదేవి అమ్మవారికి నిర్వహించనున్న 24 గంటల అఖండ భజన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆదివారం 12వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ దారవత్ తిరుమల వాస్‌కు ఆలయ ప్రధానార్చకులు రాంబట్ల హరీష్ శర్మ అందజేసి, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు రాంబట్ల హరీష్ శర్మ మాట్లాడుతూ, ఆషాఢమాస ఏక్కామ బోనం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణలు నిర్వహించడంతో పాటు 24 గంటల పాటు



నిరంతరాయంగా అఖండ భజన నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తుల భాగస్వామ్యంతో జరిగే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని విజ్ఞప్తి చేశారు. ఆహ్వాన పత్రికను స్వీకరించిన కౌన్సిలర్ దారవత్ తిరుమల వాస్ మాట్లాడుతూ, ధార్మిక కార్యక్రమాలు సమాజంలో ఆధ్యాత్మిక భావనలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. కెమికల్ హనుమాన్ దేవాలయంలో నిర్వహిస్తున్న అఖండ భజన కార్యక్రమం భక్తులకు ఆధ్యాత్మిక ప్రశాంతతను అందించడమే కాకుండా సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లపై చర్చించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బంక కుమార్, రాజేందర్, శ్రీధర్, రాజిరెడ్డి, బాపన్న, తుమ్మ శ్రీనివాస్, రవి, చిన్న, రాపల్లి సంపత్, వెంకటేష్ తదితరులు పాల్గొని కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# పెద్ది సుదర్శన్‌రెడ్డికి ఘన నివాళి



**నల్లబెల్లి/ఆగస్టు 3 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అకాల మరణం పట్ల సంతాపం తెలిపేందుకు నాలుగో రోజు కూడా నాయకుల సందర్శనలు కొనసాగాయి. నల్లబెల్లిలోని ఆయన నివాసానికి చేరుకున్న మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, సీనియర్ నాయకులు భరత్‌కుమార్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సారంగపాణి, మాజీ జెడ్పీటీసీ హరినాథ్‌సింగ్, డాక్టర్ చిరంజీవి మోటెతో పాటు పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రజా సేవలను కొనియాడిన నాయకులు, ఆయన మరణం ప్రాంత ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# పాత రోడ్లకే సీసీ.. కొత్త వీధులకు నిరీక్షణ..!

**ధర్మసాగర్‌లో రోడ్ల ఎంపికపై గ్రామస్థుల్లో అసంతృప్తి**

**పారదర్శకతతో వివరాలు వెల్లడించాలని విజ్ఞప్తి -రేపటి సంచికలో పూర్తి వివరాలతో**

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, ఆగస్టు 3 (జర్నలిస్ట్ వార్త):** గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నాయి. అయితే హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మేజర్ గ్రామపంచాయతీలో జరుగుతున్న సీసీ రోడ్ల పనుల ఎంపికపై గ్రామస్థుల నుంచి పలు ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే సీసీ రోడ్లు ఉన్న కొన్ని ప్రాంతాల్లోనే మళ్లీ పనులు చేపడుతుండగా, ఎన్నో ఏళ్లుగా మట్టి రోడ్లతో ఇబ్బందులు పడుతున్న వీధులు, కాలనీలు ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదని స్థానికులు వాపోతున్నారు. వర్షం పడితే బురద, ఎండాకాలంలో దుమ్ముతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలకు ప్రాధాన్యం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కాలనీలు, అధిక జనాభా నివసించే ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ, ధర్మసాగర్‌లో ఆ లక్ష్యం ఎంతవరకు నెరవేరిందనే చర్చ సాగుతోంది. ఒకటి, రెండు కుటుంబాలు ఉన్న వీధుల్లో సీసీ రోడ్ల పనులు జరుగుతుండగా, ఎక్కువ కుటుంబాలు నివసించే ప్రాంతాలు ఇంకా ఎదురు చూడాల్సిన పరిస్థితి




ఎందుకు వచ్చిందని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. సీసీ రోడ్ల ఎంపిక ఏ ప్రమాణాల ప్రకారం జరిగింది? గ్రామసభ తీర్మానాలను పరిగణనలోకి తీసుకున్నారా? వార్డుల వారీగా అవసరాల జాబితా రూపొందించారా? ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారా? వంటి ప్రశ్నలకు గ్రామపంచాయతీ స్పష్టమైన వివరణ ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజాధనంతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో పూర్తి పారదర్శకత ఉండాలని, నిధుల కేటాయింపు వివరాలను బహిర్గతం చేయాలని, అవసరమైన ప్రాంతాలకు ప్రాధాన్యం కల్పించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ అంశంపై జిల్లా అధికారులు, సంబంధిత శాఖ ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించి వాస్తవ పరిస్థితిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ధర్మసాగర్ గ్రామపంచాయతీలో సీసీ రోడ్ల ఎంపిక వెనుక అసలు ప్రమాణాలేమిటి? ఏ వార్డులకు ఎంత నిధులు? ఏ వీధులు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి? గ్రామస్థుల వాదనలేమిటి? అధికారుల వివరణ ఏమిటి?

**పూర్తి వివరాలతో ప్రత్యేక కథనం... రేపటి సంచికలో.**

# బురదలోనే బతుకులు.. 3వ వార్డుకు మౌలిక వసతులెప్పుడూ?

**అంబేద్కర్ నగర్, రవీంద్ర నగర్‌లో రోడ్లుడ్రైనేజీ నిర్మించాలి**

**ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు కౌన్సిలర్ బెడ్డల సౌజన్య విజయ్‌కుమార్ వినతి**

**బెల్లంపల్లి/ ఆగస్టు 3 (జర్నలిస్ట్ వార్త):** బెల్లంపల్లి మున్సిపాలిటీ 3వ వార్డు పరిధిలోని అంబేద్కర్ నగర్, రవీంద్ర నగర్ ప్రాంతాల్లో ఏళ్లుగా మౌలిక వసతుల కొరత ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని 3వ వార్డు కౌన్సిలర్ బెడ్డల సౌజన్య విజయ్‌కుమార్ అన్నారు. సీసీ రోడ్లు, పక్కా డ్రైనేజీ లేక ప్రతి వర్షాకాలంలో బురద, మురుగునీటితో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను కోరారు. సోమవారం ఎమ్మెల్యేకు సమర్పించిన వినతిపత్రంలో ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ నగర్, రవీంద్ర నగర్‌లో పలు వీధుల్లో ఇప్పటికీ సీసీ రోడ్లు లేకపోవడంతో స్వల్ప వర్షానికే రహదారులు బురదమయంగా మారుతున్నాయని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు రోడ్లపైనే నిల్వ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. చిన్నారులు పాఠశాలలకు వెళ్లేందుకు, వృద్ధులు, మహిళలు నిత్యావసర పనుల కోసం బయటకు రావడానికే అవస్థలు పడుతున్నారని చెప్పారు. మెయిన్ రోడ్డుకు అనుసంధానంగా ఉన్న సుమారు 300 మీటర్ల గల్లీ రోడ్డును సీసీ రోడ్డుగా నిర్మించడంతో పాటు పక్కా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వర్షపు నీరు ఇళ్ల ముందు నిల్వ ఉండటంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తడమే కాకుండా దోమల వ్యాప్తి పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 3వ వార్డు అభివృద్ధికి కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్), జిల్లా ఖనిజ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీఈ) నిధులు, ఎమ్మెల్యే స్థానిక అభివృద్ధి నిధులను వినియోగించి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆమోదం తెలపాలని ఎమ్మెల్యేను కోరారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని వెంటనే స్పందించి అభివృద్ధి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# వర్ధన్నపేటలో పాస్టర్ల ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక



**వర్ధన్నపేట/ ఆగస్టు0 3(జర్నలిస్ట్ వార్త);** వర్ధన్నపేట మండల పాస్టర్ల ఫెలోషిప్ సేవకుల సమావేశం సోమవారం ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. పాస్టర్లు శ్యామ్ సుందర్ రెడ్డి, సుమన్, యాకోబు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాత కమిటీని రద్దు చేసి 20262028 కాలానికి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీలో అధ్యక్షుడిగా పాస్టర్ అరుణ్ పాల్, కార్యదర్శిగా పాస్టర్ ప్రభుదాస్, కోశాధికారిగా పాస్టర్ బావు సింగ్ నాయక్, ఉపాధ్యక్షుడిగా పాస్టర్ క్రిష్టఫర్, ఉప కార్యదర్శిగా పాస్టర్ కిరణ్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ సేవలు విజయవంతం కావాలని సమావేశంలో పాల్గొన్న సేవకులు ఆకాంక్షించారు.

# ఎస్ఐఆర్ 100 శాతం ఓటరు నమోదు పూర్తి చేసిన బీఎల్‌ఏకు సన్మానం.






**బయ్యారం/,ఆగస్టు 3.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలం సింగారం గ్రామంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశానుసారం ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం ఓటరు నమోదు పూర్తి చేసిన 42వ బూత్ బిఎల్ఎ గుగులోత్ మహేష్ నాయక్ ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జులకంటి సీతారాం రెడ్డి గ్రామ సర్పంచ్ సింగారం సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ లు సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో బీఎల్ఏ చూపిన కృషి ప్రశంసనీయమని అన్నారు. బాధ్యతాయుతంగా సర్ కార్యక్రమాన్ని నిర్వహించిన వారిని ప్రోత్సహించే ఉద్దేశంతో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చుంచు మమత, వార్డు సభ్యులు చెరుకుపల్లి మనీషా, గుగులోత్ అనూష వెంకటేష్, సపవత్ అనిత రాందాస్, విద్య కమిటీ చైర్మన్ గుగులోత్ స్వరూప, మాజీ ఎంపీటీసీ గోపాల్ నాయక్, గ్రామ అధ్యక్షుడు గంగావత్ రవి నాయక్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చాట్ల వెంకన్న, చెరుకుపల్లి రవి, చుంచు సాయికిరణ్, గంగవత్ రాంకీనాయక్, బాలరాజు, సపవత్ సంతోష్ నాయక్, ఉపలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రవాణా శాఖలో అనవసర నిబంధనలు తొలగించండి

**: సీఎం చంద్రబాబు**



**అమరావతి ఆగస్టు 3**
రవాణా శాఖలో అనవసర నిబంధనలను తక్షణమే తొలగించాలని, టెక్నాలజీని పూర్తిస్థాయిలో ఉపయోగించి ప్రజలకు సులభతరమైన, అవినీతి రహిత సేవలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్‌లో సోమవారం వివిధ శాఖల పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖలో చేపట్టాల్సిన సంస్కరణలపై సీఎం కీలక సూచనలు చేశారు. రవాణా శాఖలో సంస్కరణలకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 24 గంటల్లో డీమ్డ్ రిజిస్ట్రేషన్ విధానం, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్ ఏర్పాటు, ఫారం-5బీ వంటి పరీక్షల తొలగింపు ద్వారా అవినీతికి ఆస్కారం లేకుండా చూడవచ్చని తెలిపారు. ఈ చర్యలతో ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. దశలవారీగా ఈ సంస్కరణలను అమలు చేసేందుకు తాము ప్రణాళిక సిద్ధం చేశామని అధికారులు చెప్పగా, వీలైనంత త్వరగా అనవసర నిబంధనలను తొలగించి, ప్రజలకు ఇబ్బందులు లేని వ్యవస్థను రూపొందించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై కూడా సీఎం సుదీర్ఘంగా చర్చించారు. ఎల్ నినో ప్రభావంతో తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని, ఈ సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రిజర్వాయర్లలో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు గమనిస్తూ, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నందున కృష్ణా బేసిన్‌లోకి నీటి లభ్యత పెరిగే అవకాశం ఉందని, కృష్ణా, గోదావరి నదుల నుంచి వచ్చే వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా సమర్థవంతమైన నీటి నిర్వహణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. వర్షాభావం కారణంగా భవిష్యత్తులో పశుగ్రాసం కొరత ఏర్పడే అవకాశం ఉందని, దీనికి అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి నాణ్యతను తరచూ పరీక్షించాలని, ల్యాబ్ నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ధనుసరి కోటయ్య ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవం..






**బయ్యారం/ఆగస్టు 3.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలంలోని ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పనిచేసిన ధనసరి కోటయ్య శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా కోటయ్య స్వగృహం కట్టుగూడెం గ్రామంలో అభినందన సన్మాన మహోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన వక్తలు మాట్లాడుతూ కోటయ్య తన వృత్తిని ప్రాణంగా ప్రేమిస్తూ విద్యార్థులకి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేశారన్నారు. ఉపాధ్యాయ వృత్తికే కాదు విద్యార్థుల భవిష్యత్తుకు సరైన నిర్వచనంగా తన సేవల్ని అందిస్తూ.. ప్రతీ పేద విద్యార్థిని బడి మెట్లు ఎక్కించే ప్రయత్నం చేసిన ఆ నిరడంబర గురువే ధనసరి కోటయ్య పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు. కోటయ్య విద్యతో పాటు స్టూడెంట్స్ ఆర్థికంగా వెనకబడి విద్య మానేసే విద్యార్థులను సైతం ఆర్థికంగా ఆదుకుంటు వారి విద్య పూర్తి చేసే విధంగా నిరంతరం కృషి చేశారు. ఇలా చెప్తా ఉంటే ఉపాధ్యాయ వృత్తిలో ఆయన సేవలు అనంతం. అమోఘం.. అద్వితీయం. దానిని మాటల్లో వ్యక్తీకరించలేం. ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన ఇలాంటి వ్యక్తి నిరాడంబరంగా తన పదవీ విరమణ కార్యక్రమం ఎలాంటి ఆర్భాటం హంగులకు పోకుండా పదవీ విరమణ పొందారు. అందుకే ఆయన నిరాడంబర గురువయ్యారు. అందరికీ ఆదర్శనీయంగా మారారని తోటి ఉపాధ్యాయులు అన్నారు. ఈ సందర్భంగా కోటయ్య, కోటమ్మ దంపతులకు ఉపాధ్యాయులు, మిత్రులు ఘనంగా శాలువాలతో, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బంధువులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో అడ్డా వివాదాలు వద్దు.. చట్టాన్ని గౌరవించండి

**నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు: సీఐ డి. విశ్వేశ్వర్**

**గీసుగొండ/ఆగస్ట్ 03(జర్నలిస్ట్ వార్త);** మచ్చాపూర్ ఆటో అడ్డా వినియోగంపై నెలకొన్న వివాదాలను పరస్పర అవగాహనతో పరిష్కరించుకోవాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గీసుగొండ సీఐ డి. విశ్వేశ్వర్ హెచ్చరించారు. గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని మచ్చాపూర్ గ్రామ ఆటో అడ్డా వినియోగానికి సంబంధించి మచ్చాపూర్, ఎలుకుర్తి, అరెపల్లి గ్రామాల ఆటో డ్రైవర్ల మధ్య తలెత్తిన వివాదం నేపథ్యంలో సోమవారం గీసుగొండ పోలీసులు, ప్రాంతీయ రవాణా శాఖ అధికారులతో కలిసి ఇరు గ్రామాల ఆటో యూనియన్ ప్రతినిధులు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.
ఈ సందర్భంగా సీఐ విశ్వేశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతితో ఏర్పాటు చేసిన ఆటో స్టాండ్‌లను మాత్రమే వినియోగించాలని సూచించారు. ప్రతి ఆటో డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, పర్మిట్, బీమా, ఫిట్‌నెస్ ధ్రువపత్రాలు సహా అన్ని అవసరమైన పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. మోటారు వాహన చట్టం ప్రకారం విధించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ఏ ఆటో యూనియన్ లేదా వ్యక్తులు ఇతర డ్రైవర్లను అడ్డుకోవడం, బెదిరించడం, బలవంతంగా ఆటోలను నిలిపివేయడం, శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్లు పరస్పర సహకారంతో వ్యవహరిస్తూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాలని సూచించారు.
భవిష్యత్తులో ఆటో అడ్డా అంశంపై వివాదాలు సృష్టించినా, గొడవలకు దిగినా సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ డి. విశ్వేశ్వర్ హెచ్చరించారు. శాంతి, సామరస్యాలను కాపాడుతూ పోలీసు శాఖకు సహకరించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.